క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన ముస్లిం నేతలు



మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ ముస్లిం నేతలు

అమలాపురం టౌన్: ఇటీవల అమలాపురం మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన వి.నిర్మల్‌కుమార్‌ను ఆయన చాంబర్‌లో పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ ముస్లిం నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్, పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖాదర్, పార్టీ నాయకులు ఖ్వాజాబాబు, యూసఫ్ కలిశారు. పట్టణాభివృద్ధికి తమ వంతు సహకరిస్తామని కమిషనర్‌కు వారు చెప్పారు. అనంతరం కమిషనర్‌ను వారు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా బాగిత్తమ్మ జాతర



బాగిత్తమ్మవారికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ముమ్మిడివరం: యాదవుల కుల దైవం బాగిత్తమ్మవారి జాతర ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజులపాటు ఈ జాతర నిర్వహించనున్నారు. శుక్రవారం అమ్మవారిని గుడి నుంచి బయటకు తీసుకువచ్చి ఉత్సవాలు ప్రారంభించారు. శనివారం ఉదయం అమ్మవారిని డప్పు వాయిద్యాలు, కొమ్ము బూరల మధ్య కోలాహలంగా ఊరేగించారు.

ఉపాధి కూలీకి పాముకాటు

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ బొడ్డువానిలంక గ్రామంలో ఉపాధి పని చేస్తున్న కూలీ కుడుపూడి రాధాకృష్ణ శనివారం విషసర్పం కాటుకు గురయ్యాడు. స్థానిక పంట కాలువలో పని చేస్తుండగా రాధాకృష్ణను పాము కాటు వేసింది. స్థానికులు అతన్ని తాళ్లరేవు సామాజిక ఆస్పత్రికి తరలించగా వైద్యులు ప్రాథమిక చికిత్స చేసారు. అస్వస్థతకు గురైన రాధాకృష్ణను వైఎస్సార్ సీపీ తాళ్లరేవు మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్, పోలేకుర్రు సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, కోరంగి ఉప సర్పంచ్ కామాడి భైరవమూర్తి తదితరులు పరామర్శించారు. రాధాకృష్ణను మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తున్నట్లు వైద్యులు తెలిపారు.

తాచుపాము హల్‌చల్



చెయ్యేరు నేతాజీ నగర్‌లో తాచుపామును పట్టుకున్న స్నేక్ క్యాచర్ గణేష్ వర్మ

కాట్రేనికోన: చెయ్యేరు నేతాజీ నగర్‌లో సామంతకుర్తి దానయ్య ఇంటి ఆవరణలో సుమారు ఏడు అడుగుల తాచుపాము హల్‌చల్ చేయడంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురయ్యారు. స్థానికుల సమాచారంతో ఘటన స్థలానికి చేరుకున్న స్నేక్ క్యాచర్ గణేష్ వర్మ పామును సీసాలో బంధించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న వర్షాలకు పాముల ఆవాసాల నుంచి బయటకు వచ్చి నివాస ప్రాంతాలు, షాపుల్లోకి వస్తున్నాయన్నారు. పాములను చంపవద్దని, తనకు సమాచారం ఇస్తే వాటిని పట్టుకుని సురక్షిత ప్రాంతాల్లో వదిలి వేస్తానన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలే లక్ష్యం

యానాం: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా తమ సొసైటీ పనిచేస్తుందని ది సిటిజన్ కోపరేటివ్ సొసైటీ లిమిటెడ్ యానాం శాఖ మేనేజర్ కాశి అశోక్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం బ్రాంచి కార్యాలయం వద్ద ఖాతాదారుల సమావేశాన్ని నిర్వహించారు. సొసైటీ చైర్మన్, డైరెక్టర్, మేనేజింగ్ డైరెక్టర్లు హాజరై సొసైటీ పనితీరును వివరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది, 150 మంది ఖాతాదారులు హాజరయ్యారు.

ప్రజలను మోసం చేస్తున్న మోదీ ప్రభుత్వం

అమలాపురం టౌన్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజలను అన్ని విధాలా మోసం చేస్తోందని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆరోపించారు. అమలాపురంలో శనివారం నిర్వహించిన డీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. అంబానీ, అదానీలతో దేశంలో ఆర్థిక ఎమర్జెన్సీ కొనసాగుతోందని ఆరోపించారు. పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ అదనపు భారం ?

- ఈదరపల్లి పాత వంతెన మీదుగా మోటార్ సైకిళ్లు, - ఆటోలు, కార్ల రాకపోకలు
- ఆర్టీసీ బస్సులు వెళ్లేందుకు అనుమతించని అధికారులు
- ప్రయాణికులకు తప్పని అదనపు టికెట్ ధరాభారం
- దూరం పెరగడంతో సమయం వృథా



ఈదరపల్లిలో పాత వంతెన మీదుగా వెళుతున్న వాహనాలు

అమలాపురం టౌన్: ఈదరపల్లి కొత్త వంతెన నిర్మాణం కోసం పాత వంతెనపై రాకపోకలను నిలిపివేసి 50 రోజులు కావస్తోంది. ఆరు రోజులుగా పాత వంతెనపై కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలకు మాత్రం అనుమతిచ్చారు. వంతెన నిర్మాణంతో విధించిన ట్రాఫిక్ ఆంక్షలు అమలులోకి వచ్చినప్పటి నుంచి ఆర్టీసీ బస్సులు బోడసకుర్రు వంతెన సమీపంలోని తోట్లపాలెం, వాకలగరువు, అంబాజీపేట మీదుగా రావులపాలెం, రాజమహేంద్రవరం, విజయవాడ వైపు వెళుతున్నాయి. ఇవే బస్సులు పాత ఈదరపల్లి వంతెన మీదుగా అంబాజీపేట తదితర ప్రాంతాలకు బస్సులు వెళ్లేవి. ఈదరపల్లి కొత్త వంతెన స్లాబ్ నిర్మాణం పూర్తయింది. పక్కనే ఉన్న పాత వంతెన సామర్థ్యంగానే ఉంది. అయినప్పటికీ ఆర్టీసీ బస్సుల రాకపోకలకు అధికారులు అనుమతులు ఇవ్వలేదు.

అధికారులు పునరాలోచించాలి

అమలాపురం ఉంచి ఈదరపల్లి పాత వంతెన మీదుగా ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న అంబాజీపేట నుంచి బస్సులు సునాయాసంగా వెళ్లేవి. ఇప్పుడు కొత్త వంతెన నిర్మాణం పేరుతో విధించిన ట్రాఫిక్ ఆంక్షల వల్ల ఆర్టీసీ బస్సులు చుట్టూ తిరిగి తోట్లపాలెం మీదుగా అంబాజీపేట వెళుతుండడంతో ప్రయాణికలకు టికెట్. ధరలు అదనపు భారం పడుతోంది. సమయం కూడా ఎక్కువ పడుతోంది. పాత వంతెన మీద నుంచి మీదుగా వెళ్లే ఆర్టీసీ బస్సులు పది నిమిషాల్లో అంబాజీపేటకు వెళ్లేవి. ఉదాహరణకు అమలాపురం నుంచి ఆర్టీసీ బస్సుకు రూ.75 (పాసింజర్), రూ.95 (ఎక్స్‌ప్రెస్) బస్సులకు టికెట్ల ధరలు ఉండేవి. ఇప్పుడు బస్సులు చుట్టూ తిరిగి తోట్లపాలెం నుంచి అంబాజీపేట రావడానికే అరగంట నుంచి 45 నిమిషాలు సమయం పడుతోంది. అదనపు కిలోమీటర్ల వల్ల అదనపు టికెట్ ధరలు కూడా ప్రయాణికులు చెల్లించాల్సి వస్తోంది. ఈ దూరపు ప్రయాణం వల్ల ప్రతి ప్రయాణికుడు ఆర్టీసీ టికెట్లను రూ.10 నుంచి రూ.15 అదనంగా చెల్లించాల్సి వస్తోంది. అమలాపురం నుంచి అంబాజీపేట చేరుకునే ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో పది నిమిషాలకు బదులుగా అరగంట సమయంపైనే ప్రయాణించాల్సి వస్తోంది. గతంలో రూ.10 టికెట్ సరిపోయేది. ప్రస్తుతం రూ. 20 నుంచి రూ.25 వరకూ చెల్లించాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రతి రోజూ వేలాది మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో అంబాజీపేట, కొత్తపేట రావులపాలెం, విజయవాడ, రాజమహేంద్రవరం వెళుతుంటారు. వీరంతా వంతెన నిర్మాణం కారణంగా విధించిన ట్రాఫిక్ ఆంక్షల వల్ల 50 రోజులుగా అదనపు టికెట్ల ధరలు చెల్లించడమే కాకుండా సమయం కూడా వృథా అవుతోంది. పోలీస్, ఆర్‌అండ్‌బీ, ఆర్టీసీ శాఖల అధికారులు దీనిపై పునరాలోచించి ఈదరపల్లి పాత వంతెనపై నుంచి ఆర్టీసీ బస్సుల రాకపోకలను పునరుద్ధరించాలని ప్రయాణికుల విజ్ఞప్తి చేస్తున్నారు.

వంతెనపై నిఘా లోపం

ఈదరపల్లి పాత వంతెనపై ప్రస్తుతానికి కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలకు అనుమతి ఇచ్చినప్పటికీ ఆ వంతెన వద్ద నిఘా లోపం వల్ల ఒక్కోసారి లారీలు, మినీ లారీలు, హైటెక్ బస్సులు వెళ్లిపోతున్నాయి. వాస్తవానికి ఈదరపల్లి వంతెన పనులు మొదలయ్యాక విధించిన ట్రాఫిక్ ఆంక్షలతో ఆర్టీసీ బస్సులను తోట్లపాలెం మీదుగా పంపిస్తుంటే లారీలు, హైటెక్ బస్సులను నల్లవంతెన మీదుగా నేదునూరు, ముక్కామల వరకూ లేదా ఈదరపల్లి అయ్యప్పస్వామి ఆలయం సమీపంలో పంట కాలువపై వేసిన క్రాస్ బండ్ ద్వారా ముక్కామల మీదుగా రావులపాలెం వైపు వెళుతున్నాయి. ఈదరపల్లి పాత వంతెన వద్ద ముఖ్యంగా అధికారుల నిఘా లోపించడం వల్లే లారీలు, హైటెక్ బస్సులు ఒక్కోసారి పాత వంతెనపై నుంచి వెళ్లిపోతున్నాయి. ఆర్టీసీ బస్సులకు అధికారికంగా అనుమతుల ఇచ్చే వరకూ తోట్లపాలెం, అంబాజీపేట మీదుగానే నడుపుతున్నారు.

పాఠశాలకు సీలింగ్ ఫ్యాన్ల బహూకరణ



బండారులంక ఉన్నత పాఠశాల హెచ్ఎం బాలకు ఫ్యాన్లు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

అమలాపురం రూరల్: బండారులంకలో పేరి రామేశ్వర శర్మ, బాసిన గంగరాజు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలకు 1997–98 సంవత్సరం 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు 8 సీలింగ్ ఫ్యాన్లు బహూకరించారు. పాఠశాల హెచ్ఎం యస్.వెంకటలక్ష్మీబాల, ఉపాధ్యాయుల సమక్షంలో వీటిని శనివారం అందజేశారు. పాఠశాల అభివృద్ధికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని పూర్వ విద్యార్థులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సంఘం నాయకులు జాన జగదీష్ చంద్రగణేష్, మామిడిశెట్టి విష్ణు ప్రసాద్, కాలెపు కుమారస్వామి, విత్తనాల సురేష్, బళ్ల నాగమణి, పుత్సల భాస్కర్, సరెళ్ళ ఏడుకొండలు, దంగేటి ప్రసాద్, బళ్ల వేణు, లక్కింశెట్టి మల్లికార్జున, పిచ్చిక సత్యం పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన స్టేడియం



అమలాపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: అమలాపురంలోని జీఎంసీ బాలయోగి స్టేడియం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని మాజీ జాతీయ క్రీడాకారుడు, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ఆరోపించారు. రాత్రి వేళల్లో స్టేడియంలోకి గంజాయి బ్యాచ్ చొరబడుతోందన్నారు. అమలాపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు శనివారం సాయంత్రం స్థానిక మీడియాతో మాట్లాడారు. జాతీయ స్థాయి క్రీడాకారులు తయారు చేయాలన్న లక్ష్యంతో 17 ఎకరాల సువిశాల స్థలంలో 20 ఏళ్ల క్రితం ఏర్పాటుచేసిన బాలయోగి స్టేడియం ఇప్పుడు గతి తప్పుతోందని ఎమ్మెల్సీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ స్టేడియంలో రూ.కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మించారని, వెయిట్ లిఫ్టింగ్, స్కేటింగ్, రన్నింగ్ ట్రాక్, క్రికెట్ స్టేడియం, షటిల్ బ్యాడ్మింటన్, బాడీ బిల్డర్లకు అవసరమైన క్రీడా సామగ్రిని సమకూర్చారని తెలిపారు. స్టేడియంలోకి ప్రవేశించాలంటే క్రీడాకారులు నగదు చెల్లించాలని ఆరోపించారు. ఇలాగైతే జాతీయ పోటీలకు తలపడే క్రీడాకారులు ఎలా తయారవుతారని ఆయన ప్రశ్నించారు. దీనిపై దివంగత బాలయోగి తనయుడు, అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ సభ్యుడు గంటి హరీష్ మాథూర్ స్పందించాలని ఎమ్మెల్సీ స్పష్టం చేశారు. సమస్యలను ఏపీ క్రీడా శాఖ మంత్రి, శాప్ చైర్మన్ దృష్టికి తీసుకుని వెళుతున్నట్లు ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు తెలిపారు. కోనసీమ ఫుట్ బాల్ అసోసియేషన్ ప్రతినిధి చీకురుమిల్లి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ పదవుల కోసం పట్టు

యానాం: పుదుచ్చేరిలో ఎన్ఆర్ కాంగ్రెస్, బీజేపీ నేతృత్వంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం సాఫీగా సాగుతున్న నేపథ్యంలో బీజేపీ అధిష్టాన నిర్ణయంతో కూటమిలో ఒక మంత్రి, ముగ్గురు నామినేటెడ్ ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో తమ పార్టీ ఎమ్మెల్యేలకు వివిధ ప్రభుత్వరంగ బోర్డుల్లో ఖాళీగా ఉన్న చైర్మన్ పదవులను దక్కించుకునేలా శనివారం సీఎం రంగసామిపై బీజేపీ ఒత్తిడి తెచ్చింది. 2021లో బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అప్పట్లో వివిధ ప్రభుత్వ రంగ సంస్థల బోర్డులకు చైర్మన్లుగా బీజేపీ ఎమ్మెల్యేలకు ఇస్తామని సీఎం హామీ ఇచ్చారు. అప్పటి నుంచి నాలుగున్నర ఏళ్లు గడిచినా పదవులు ఎవరికీ ఇవ్వకుండా తాత్సారం చేశారు. దీంతో ప్రభుత్వానికి మద్దతునిస్తున్న బీజేపీ, ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలు అసంతృప్తిగా ఉన్నారు. ఎన్ఆర్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా నిరాశతో ఉన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల నాటికి పార్టీని మరింత బలోపేతం చేయడానికి వివిధ ప్రభుత్వరంగ సంస్థల బోర్డుల్లో చైర్మన్లుగా పదవులను ఇవ్వాలని ఇరుపార్టీల నేతలు కోరుతున్నారు.

సుబ్బాలమ్మకు ఆషాఢం సారె సమర్పణ



సుబ్బాలమ్మకు ఆషాఢం సారెను సమర్పిస్తున్న సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు, మహిళలు

అమలాపురం టౌన్: పట్టణంలోని సుబ్బాలయ్మ దేవస్థానంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంస్థ ప్రతినిధులు, మహిళలు అమ్మవారికి ఆషాఢం సారెను శనివారం సమర్పించారు. అమలాపురం పట్టణ దేవత సుబ్బాలమ్మను స్థానికులు ఆడపడుచుగా కొలిచి భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తారు. సారెతో నింపిన వస్తువులతో బిందెలతో మహిళలు అమ్మవారి వద్దకు ప్రదర్శనగా వచ్చారు. మేళ తాళాలతో సుబ్బాలమ్మ కొలుస్తూ ప్రదర్శన సాగింది. సమరసత సేవా ఫౌండేషన్ అమలాపురం నగర కన్వీనర్ అర్లపల్లి ముత్యాలరావు (గురు భవాని), సహ కన్వీనర్ కోన వెంకట్రావు (అయ్యప్ప గురుస్వామి), ఖండ సంయోజక్ మేడిశెట్టి శ్రీరామ్, అమలాపురం ధర్మ ప్రచారక్ మేడిశెట్టి నాగభూషణం, పౌర్ణమి హారతి ప్రతినిధులు, మహిళలు, పట్టణ ప్రముఖులు అధిక సంఖ్యలో అమ్మవారికి సారె సమర్పణ కార్యక్రమంలో పాల్గొన్నారు. బెల్లం పానకం, చలిమిడి, స్వీట్లు, చీరలు, గాజులు, పువ్వులు తదితర సామగ్రిని బిందెలతో తెచ్చి అమ్మవారికి సమర్పించారు.

గోదావరిలో దూకి ఆత్మహత్యాయత్నం

కాపాడిన యువకులు.. ఆసుపత్రికి తరలింపు



శ్రీనివాసరావును రక్షించి బోటులో తీసుకువస్తున్న యువకులు

యానాం: స్థానిక బాలయోగి వారధి నుంచి గోదావరిలో దూకి వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టిన ఘటన ఇది. పోలీసుల కథనం ప్రకారం కాకినాడకు చెందిన తలాటం శ్రీనివాసరావు శనివారం మధ్యాహ్నం బాలయోగి వారధి నుంచి గౌతమీ గోదావరిలో దూకి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. ఈ నేపథ్యంలో గోదావరిలో కొట్టుకుపోతున్న శ్రీనివాసరావును స్థానిక యువకులు మల్లాడి వెంకట్, కాలాడి విజయ్, పోతాబత్తుల దుర్గాప్రసాద్, కిరణ్ తదితరులు గమనించి తక్షణం స్పందించారు. యానాం టూరిజం శాఖకు చెందిన బోట్ల సహాయంతో శ్రీనివాసరావును రక్షించి ఒడ్డుకు చేర్చారు. అనంతరం అపస్మారకస్థితిలో ఉన్న ఆయనను బైక్‌పై యానాం ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాసరావు కాకినాడ నల్లావారి వీధి, కర్ణంగారి జంక్షన్ ప్రాంతానికి చెందిన వాడిగా అతని వద్దనున్న ఆధార్‌కార్డు ఆధారంగా గుర్తించారు. మెరుగైన వైద్యం కోసం శ్రీనివాసరావును కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. యానాంలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేతతో గోదావరి ఒడ్డున యువకులు కాలక్షేపంకోసం కూర్చున్నారని ఈ నేపథ్యంలో శ్రీనివాసరావు కొట్టుకుపోతుండటం గమనించి అతని రక్షించడంతో స్థానికులు, పోలీసులు వారిని అభినందించారు.

బిందెడు నీళ్లూ రాని కుళాయిలు ఎందుకు?

సర్వసభ్య సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారిని నిలదీసిన ఎంపీటీసీ సభ్యులు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శేషగిరిరావు

అల్లవరం: జలజీవన్ మిషన్ పథకం ద్వారా రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన ఇంటింటికీ కుళాయిలకు కనీసం బిందెడు నీళ్లు రావడం లేదని, అలంకారప్రాయంగా అవి దర్శినమిస్తున్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ స్వామిని సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు ప్రశ్నించారు. రెండు రోజులకు ఒకసారి ఇచ్చే తాగునీరు పూర్తిస్థాయిలో పంపిణీ చేయడం లేదని, విద్యుత్ మోటార్లు ఏర్పాటుచేసి నీటిని చోరీ చేస్తున్నా, దానిని నియంత్రించడంలో అధికారులు విఫలమవుతున్నారని ఎంపీటీసీలు అధికారులు తీరుపై మండిపడ్డారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కుళాయిలకు విద్యుత్ మోటార్లు అమర్చి నీటిని చౌర్యం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఏఈ స్వామిని ఆదేశించారు. తొలుత వ్యవసాయాధికారి కె.విజయ్ మాట్లాడుతూ దాళ్వా ధానం డబ్బులు రూ. 8 కోట్లు డబ్బులు రైతులకు జమా కావల్సి ఉందన్నారు. తహసీల్దార్ నరసింహరావు మాట్లాడుతూ రేషన్‌కార్డులో మార్పులు, చేర్పులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. డ్రెయిన్ ఏఈ సునీత మాట్లాడుతూ తాడికోన, దేవగుప్తం, సామంతకుర్రు, కొమరగిరిపట్నం మైనర్ డ్రెయిన్ ఆధునీకరణకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. 24 అంగన్‌వాడీ కేంద్రాల్లో కిచెన్ గార్డెన్ అభివృద్ధికి రూ. 10 వేలు చొప్పున నిధులు మంజూరయ్యాయని సీడీపీఓ రమాదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కొనుకు గౌతమి, ఎంపీడీఓ లక్ష్మణరావు, వైఎస్ ఎంపీపీలు వడ్డి గంగ, ముత్యాల వెంకటరామకృష్ణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దాడులను ప్రోత్సహించడం దారుణం



జిల్లా దళిత ఐక్య వేదిక సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ డీబీ లోక్

అమలాపురం టౌన్: పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలి మండలం అరవిల్లిలో మాల సామాజిక వర్గంపై మాదిగల సామాజిక వర్గం దాడి చేయడం, దానికి కూటమి ప్రభుత్వం, పోలీసులు వత్తాసు పలకడం ఆ కేసును తప్పుతోవ పట్టించడమేనని జిల్లా దళిత ఐక్య వేదిక చైర్మన్ డీబీ లోక్ ఆరోపించారు. స్థానిక అరిగెలపాలంలో శనివారం జరిగిన దళిత ఐక్యవేదిక సమావేశంలో లోక్ మాట్లాడారు. జరిగిన దాడి అమానుషమని ఆయన తీవ్రంగా ఖండించారు. వేదిక కన్వీనర్ జంగా బాబూరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో వేదిక ప్రధాన కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు, గెడ్డం సురేష్ బాబు, రేవు తిరపతిరావు, పాలమూరి మోహన్ బాబు తదితరులు మాట్లాడుతూ పోలీసుల నిర్లక్ష్యం కారణంగానే దాడి తీవ్రత పెరిగిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి షెడ్యూల్డ్ కులాల మధ్య చిచ్చు పెట్టి పబ్బం గడుపుకుంటోందని లోక్ ధ్వజమెత్తారు. సమావేశంలో దళిత ఐక్య వేదిక ప్రతినిధులు దోనిపాటి నాగేశ్వరరావు, కాశి వెంకట్రావు తదితరులు మాట్లాడారు. త్వరలోనే దళిత ఐక్య వేదిక ప్రతనిధుల బృందం ఘటనా స్థలానికి వెళ్లి నిజానిజాలు తెలుసుకుంటుందని చివరిగా సమావేశం తీర్మానించింది.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

అమలాపురం టౌన్: కూటమి ప్రభుత్వం ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. స్థానిక యూటీఎఫ్ హోమ్‌లో శనివారం నిర్వహించిన ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా కమిటీ సమావేశానికి ధనలక్ష్మి అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జిల్లా యూనియన్ అధ్యక్షురాలు బి.ఎస్తేర్ రాణి అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి మాట్లాడుతూ ఆశా వర్కర్లకు అదనపు బాధ్యతలు అప్పగించడం వల్ల పలువురు ఆరోగ్యానికి గురవున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. జూలై 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. సమావేశంలో ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మలక సుభాషిణి, జిల్లా కమిటీ ప్రతినిధులు గుర్రాల బేబీ, మంగాదేవి, వెంకటలక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన



అమలాపురం ముస్లిం స్ట్రీట్‌లో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి

అమలాపురం టౌన్: ఇటీవల పట్టణంలో పారిశుధ్య సమస్యలపై కౌన్సిలర్లు, ప్రజల నుంచి ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని, అధికారులు అప్రమత్తమై సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి సూచించారు. శనివారం పలు వార్డులో చైర్‌పర్సన్ పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. వార్డు సచివాలయాల శానిటేషన్ సెక్రటరీలు, శానిటరీ మేస్త్రీలు పాల్గొన్నారు. డ్రెయిన్లు, వీధులు, రోడ్లను శుభ్రం చేయాలని చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి సిబ్బందికి సూచించారు.

తాగునీటి సమస్యపై మహిళల ఆందోళన



చినబొడ్డు వెంకటాయపాలెంలో కలుషిత నీటిని చూపుతూ నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ చినబొడ్డు వెంకటాయపాలెంలో కుళాయిల నుంచి దుర్వాసనతో కూడిన కలుషిత నీరు వస్తోందని మహిళలు నిరసన వ్యక్తం చేసారు. స్థానిక మార్కెట్ వద్ద మహిళలు కలుషిత నీటితో నిరసన వ్యక్తం చేశారు. రెండు నెలలుగా కలుషిత నీరు తాగుతూ అనేక మంది వాంతులు, విరేచనాలతోపాటు జ్వరాల బారిన పడుతున్నారని వాపోయారు. సురక్షితమైన నీటిని అందించాలని వారు కోరారు. ఈ సందర్భంగా వార్డు సభ్యుడు సంగాడి శ్రీనివాస్ మాట్లాడుతూ తాగునీటి సమస్య రెండు నెలలుగా ఉన్నా పంచాయతీ కార్యదర్శి పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కొపనాతి నాగరాజు, రేకాడి వెంకటేశ్వర్లు, ఓలేటి నారాయణరావు, రేకాడి గంగాధర్‌రావు పాల్గొన్నారు.

గౌరవ వేతనాల బకాయిలపై నిరసన



సర్వ సభ్య సమావేశంలో నిరసన తెలుపుతున్న ఎంపీటీసీ సభ్యులు

అల్లవరం: గౌరవ వేతనాలు రెండేళ్లుగా ఇవ్వడంలేని ఎంపీటీసీ సభ్యులు నిరసన తెలిపారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అధ్యక్షతన శనివారం సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశం ప్రారంభమైన వెంటనే కొమరగిరిపట్నం ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటేశ్వరరావు సభాముఖంగా ఎంపీటీసీ వేతనాల అంశాన్ని ప్రస్తావించారు. 25 నెలలుగా ఎంపీటీసీ సభ్యులకు వేతనాలు పెండింగ్ ఉన్నాయని తెలిపారు. గత సర్వ సభ్య సమావేశం దృష్టికి తీసుకొచ్చినా నేటికీ వేతనాలు జమ కాలేదన్నారు. ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటేశ్వరరావుకి మద్దతుగా వైఎస్సార్ సీపీ, టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన ఎంపీటీసీలు సర్వ సభ్య సమావేశంలో నిరసన తెలిపారు. వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ఎంపీపీ మాట్లాడుతూ 14 నెలల కాలానికి రూ.7,20,900 నిధులను ట్రెజరీకి పంపించామన్నారు. నిధులు విడుదలైన వెంటనే ఎంపీటీసీలకు వేతనాలు జమ అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు వడ్డి గంగ, ముత్యాల వెంకట రామకృష్ణ, ఎంపీటీసీలు పులుసుగంటి రాజేశ్వరీ, మౌనిక, శ్రీశాంతి భవాని, పద్మ, కర్రి సత్య, కాండ్రేగుల వాణి, మాకే కృష్ణమూర్తి, తిక్కా శేషుబాబు ముత్తాబత్తుల రాంబాబు, మామిడిశెట్టి శ్రీను, పల్లి జేమ్స్‌రాజు, పాల్గొన్నారు.

716 మంది విద్యార్థులకు లెర్నింగ్ లైసెన్సులు

అమలాపురం రూరల్: వేసవి సెలవుల్లో జిల్లాలో దాదాపు 716 మంది విద్యార్థులు లెర్నింగ్ లైసెన్సులు పొందడం శుభ పరిణామమని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి విద్యార్థి లెర్నింగ్ లైసెన్స్ పొందాలని కోరారు. జిల్లాలో అమలాపురం, రావులపాలెం, మండపేట, రామచంద్రపురం కార్యాలయాల్లో ఆధార్ అడ్రస్ ప్రకారం విద్యార్థులు స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. కాలేజీ యాజమాన్యం, తల్లిదండ్రులు లెర్నింగ్ లైసెన్స్‌ల కోసం దరఖాస్తు చేసే విధంగా విద్యార్థులను ప్రోత్సహించాలని డీటీవో విజ్ఞప్తి చేశారు.